వేలానికి పేదల ఫంక్షన్‌హాల్ !

- ముందస్తుగా కేవిట్ దాఖలు చేసిన తెలంగాణ హౌసింగ్ అధికారులు
- వ్యతిరేకిస్తున్న హెచ్‌బీకాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు
- వేలాన్ని నిలిపేయాలని ఎమ్మెల్యే, ఎంపీకి వినతులు


ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం


నిరుపయోగంగా ఉన్న హెచ్‌బీకాలనీ కమ్యూనిటీహాల్ (జేబీ గార్డెన్)

కుషాయిగూడ: పేదల ఫంక్షన్‌హాల్‌గా పేరుగాంచిన హౌసింగ్‌బోర్డు కమ్యూనిటీహాల్ (జేబీగార్డెన్) వేలంపాటకు సిద్ధమైంది. ఈ మేరకు తెలంగాణ హౌసింగ్ సొసైటీ అధికారులు ముందస్తుగా కేవిట్ దాఖలు చేసి వేలంపాటకు రంగం సిద్ధం చేశారు. దీనిని హెచ్‌బీకాలనీ సంక్షేమసంఘాల ప్రతినిధులు వ్యతిరేకిస్తున్నారు. వేలంపాటను నిలిపేసి కమ్యూనిటీహాల్‌ను కాపాడాలని స్థానికులు ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

హౌసింగ్ బోర్డు కమ్యూనిటీహాల్ ప్రస్థానం..

1980లో మౌలాలి హౌసింగ్ బోర్డు ఏర్పాటు సమయంలోనే అప్పటి ఏపీ హౌజింగ్ బోర్డు అధికారులు 3500 గజాల స్థలంలో కమ్యూనిటీహాల్‌ను నిర్మించారు. అప్పట్లో నామమాత్రంగా రూ.1000, 2000 తీసుకుని హాల్‌ను అద్దెకు ఇచ్చేవారు. లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్న కమ్యూనిటీహాల్ కాలక్రమేణ పేదల ఫంక్షన్ హాల్‌గా మారింది. 2007 వరకు హౌసింగ్‌బోర్డు ఆధీనంలో ఉన్న కమ్యూనిటీహాల్‌కు హౌసింగ్ అధికారులు వేలంపాట నిర్వహించి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు.

జేబీగార్డెన్‌గా పేరు మార్పు..

సుమారు పదేళ్ల పాటు నిర్వహించిన ప్రైవేటు వ్యక్తులు కమ్యూనిటీహాల్‌ను జేబీగార్డెన్‌గా మార్చారు. వేలం గడువు ముగియడంతో తిరిగి 2018లో మరోసారి వేలంపాటను నిర్వహించారు. ఈసారి వేలం పాటలో పాల్గొన్న వారిలో తీవ్రపోటీ నెలకొంది. ఓ వ్యక్తి రూ.16 లక్షలకు కమ్యూనిటీహాల్‌ను దక్కించుకున్నాడు. అందులో 25 శాతం డబ్బులు కూడా చెల్లించాడు. తీరా తనకు వర్కౌట్ కాదంటూ చేతులెత్తేశాడు. ఇదిలా ఉండగానే గతంలో కమ్యూనిటీహాల్‌ను నిర్వహణ చేసిన వ్యక్తి తాను కూడా నష్టపోయానని, తిరిగి మరోసారి తనకే నిర్వహణ బాధ్యతలు ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో మూతపడ్డ జేబీగార్డెన్ సుమారు పదేళ్ల నుంచి నిరుపయోగంగానే ఉంది.

తాజాగా వేలం పాటకు సిద్ధం..

తాజాగా తెలంగాణ హౌసింగ్ సొసైటీ అధికారులు 3500 గజాల విస్తీర్ణంలో ఉన్న హెచ్‌బీకాలనీ కమ్యూనిటీహాల్‌ను వేలంపాట వేయాలని నిర్ణయించారు. గతంలో కోర్టు కేసుల దృష్ట్యా ముందస్తుగానే కోర్టులను ఆశ్రయించి కేవిట్ దాఖలు చేసిన హౌజింగ్ అధికారులు హెచ్‌బీకాలనీ ఫేజ్ 1,2 సంక్షేమ సంఘాల ప్రతినిధులకు నోటీసులు జారీచేసి వేలంపాటకు రంగం సిద్ధం చేస్తున్నారు.

హాల్‌ను కాపాడుకునేంత వరకు పోరాటం ఆగదు



కాలనీల ఏర్పాటు సమయంలోనే మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్లు, పార్కులతో పాటు 3500 గజాల స్థలాన్ని కమ్యూనిటీహాల్ కోసం కేటాయించి నిర్మాణం చేసింది. అప్పట్లోనే వేలంపాటను వ్యతిరేకించాం. కమ్యూనిటీహాల్‌పై పూర్తి హక్కులు మాకే ఉంటాయి. కమ్యూనిటీహాల్‌ను కాపాడుకునేంత వరకు మా పోరాటం ఆగదు.

– వెంకటాచారి ఫేజ్–2 అధ్యక్షుడు

అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



కమ్యూనిటీ హాల్‌ను హౌజింగ్ సొసైటీ అధికారులే తిరిగి నిర్వహించాలి. లేదంటే హెచ్‌బీకాలనీ సంక్షేమ సంఘాలు, జీహెచ్ఎంసీకి అప్పగించాలి. సామాజిక అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీహాల్ విక్రయాన్ని అధికారులు వెనక్కి తీసుకుని వేలం పాటను నిలిపేయాలి.

– ప్రభుదాస్, కార్పొరేటర్

నోటీసుల విషయం మా దృష్టికి రాలేదు

నిరుపయోగంగా ఉన్న మౌలాలి హెచ్‌బీకాలనీ కమ్యూనిటీహాల్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నాం. ఏం చేయాలన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. హెచ్‌బీకాలనీ వాసులకు నోటీసులు ఇచ్చిన అంశం మా దృష్టికి రాలేదు.

– కిరణ్‌బాబు, తెలంగాణ హౌజింగ్ ఈఈ

చర్లపల్లి డివిజన్‌కు రూ: 4.21 కోట్ల నిధులు !

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి రూ.4.21 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి మంజూరుపత్రాలను అందజేశారు. చర్లపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు, మీనాక్షినగర్, ఆఫీసర్స్‌కాలనీ, నాగార్జుననగర్ కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.51 కోట్లు, ఈసీనగర్, బీఎన్‌రెడ్డినగర్‌లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.46 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాల్‌రెడ్డి, విఠల్‌నాయక్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సిగాచి బాధితులను ఆదుకోవాలి


బొజ్జ రమేష్

మల్లాపూర్: సంగారెడ్డి జిల్లాలోని పాషామైలారంలో జరిగిన సిగాచి కెమికల్ ఫ్యాక్టరీ పేలుడు న్యాయ విచారణ జరిపించి, ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని దళిత జన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ రమేష్ డిమాండ్ చేశారు. రియాక్టర్ పేలుడులో 40 మందికి పైగా కార్మికులు మరణించడమే కాకుండా పదుల సంఖ్యలో కార్మికులు శాశ్వతంగా పనిచేయలేని స్థితిని నెట్టివేయబడ్డారని అన్నారు. ఈ ఘటనకు యాజమన్యమే పూర్తిబాధ్యత వహించాలని, సరైన భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతోనే అమాయకులైన కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షల పరిహారం అందించాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న జెడ్సీ హేమంత్‌కేశవ్‌పాటిల్

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో జరుగుతున్న స్టాటజికల్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగాం (ఎస్ఎన్‌డీపీ) పనులను మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాప్రా సర్కిల్ అధికారులతో కలిసి పరిశీలించారు. మారుతీనగర్, అంజనాక్లాసిక్ మీదుగా ఆదర్శనగర్ వరకు, ఈసీనగర్, రాంపల్లి నుంచి నాగారం వరకు చేపడుతున్న పనులను ఆయన సమీక్షించారు. అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కాప్రా సర్కిల్ డీసీ జగన్‌నాయక్, ఎస్ఎన్‌డీపీసీఈ. కోటేశ్వరరావు, డీఈ వెంకట్‌కిరణ్, ఈఈ నాగేందర్, డీఈ బాలకృష్ణతో పాటుగా స్థానికులు పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీసీగా గోపాల్


సత్కరిస్తున్న కాప్రా సర్కిల్ సిబ్బంది

కాప్రా: ఎల్బీనగర్ జోన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కమిషనర్‌గా గోపాల్ నియమితులయ్యారు. శేరిలింగంపల్లి జోన్‌లో లైసెన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన గోపాల్ బదిలీపై ఎల్బీనగర్ జోన్‌కు వచ్చారు. ఈ జోన్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీసీగా బాధ్యతలు చేపట్టి మంగళవారం కాప్రా సర్కిల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ అధికారులు, సిబ్బంది ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్‌తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన


ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో గత 3 రోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ థీమటిక్ ఎగ్జిబిషన్ సందర్శకులకు ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలతో కళాకారులు అలరించారు.

పీర్జాదిగూడ బీజేపీ నూతన కార్యవర్గం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్‌జోన్ బీజేపీ అధ్యక్షుడు జమ్మల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్‌జోన్ బీజేపీ పూర్తిస్థాయి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షుడు సుధాకర్‌చారి, మల్లారెడ్డి, శేఖగిరిరావు, వెంకట్‌రెడ్డి, సంతోష్, కిషోర్, ప్రధాన కార్యదర్శులుగా పూజారి స్వరూప్‌చంద్ర, బాల్‌రెడ్డి, కోశాధికారిగా రాగిడి వెంకట్‌రెడ్డి, కార్యదర్శులుగా స్వప్న, పవన్‌గౌడ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, కృష్ణంరాజు, చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి



మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల సమస్యలపై మున్సిపల్ సిబ్బంది మంగళవారం పలు కాలనీల్లో సమావేశం ఏర్పాటు చేశారు. 100 రోజుల కార్యాచరణ, స్వచ్ఛ్ పీర్జాదిగూడ కార్యక్రమంలో భాగంగా మహారాజ్ పోర్టు, బీపీఎం కాలనీ, బాలాజీనగర్‌లలోని కాలనీ సంక్షేమ సంఘాలతో సమావేశమై కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలపై కాలనీవాసులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు త్వరలోనే కాలనీల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరు చేసే విధానం, తాగునీటి సరఫరా, వనమహోత్సవం, డ్రెయిన్ సమస్యలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజనీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, బాలమురళికృష్ణ, మున్సిపల్ సిబ్బంది, కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

మల్లాపూర్: రాష్ట్రంలో ఈఎస్ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల 3 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని లేదంటే డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరించారు. మంగళవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుకుమార్ అధ్యక్షతన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ హాజరై మాట్లాడారు. నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, నర్సింగ్ సిబ్బంది, వార్డు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు, టెక్నీషియన్లు, డీఈఓలు తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ 3 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్ చట్టం ప్రకారం 7వ తేదీ లోగా కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. యూనియన్ నాయకులు ధన్‌రామ్, క్రాంతి, సుకన్య, లింగమ్మ, పద్మ, భాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీసిల్టింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి


విష్ణుపురి కాలనీలో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఉన్న నాలాల్లో డీసిల్టింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ హైడ్రా సిబ్బందికి సూచించారు. మంగళవారం విష్ణుపురి కాలనీలో నాలాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మాన్‌సూన్ యాక్షన్‌ప్లాన్ హైడ్రాకు అప్పగించడం సరికాదన్నారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నప్పుడు వెంటనే అధికారులు, సిబ్బంది స్పందించే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. నాలాల్లో డీసిల్టింగ్ చేస్తేనే ముంపు సమస్య తీరుతుందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించామన్నారు. హైడ్రా సూపర్‌వైజర్ చంద్రశేఖర్, వీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో విద్యార్థుల్లో ప్రతిభ మెరుగు


జాతీయ సెమినార్‌లో విద్యార్థులు

ఉప్పల్: 'క్రిస్పర్ టెక్నాలజీ అండ్ జీన్ ఎడిటింగ్'పై రెండ్రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను జూలై 14, 15 తేదీల్లో ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్‌సైన్స్, హిమీడియా లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ జాన్ కలరక్కల్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డిలు తెలిపారు. రెండ్రోజుల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లక్ష్మీనరసింహ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మైఫ్లవర్‌హైట్స్, లక్ష్మీనరసింహకాలనీ, మెటా వెంచర్స్, 11కేవీ సూర్యనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. 11కేవీ అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మేడిపల్లి: 11కేవీ సాయిప్రియకాలనీ ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11పర్వతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

- 11కేవీ ప్రతాప్ సింగారం ఫీడర్ పరిదిలో పీఎంఐ వర్క్స్, చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11కేవీ ప్రతాప్‌సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 వరకు ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఉప్పల్: ఐఐసీటీ 33/11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హెచ్ఎంటీనగర్ వీధి నెంబర్–1, శ్రీనగర్ కాలనీ, నాచారం మెయిన్‌రోడ్డు, హెచ్ఎంటీ కమాన్ నుంచి నాచారం పోలీస్‌స్టేషన్ వరకు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు.

- రామంతాపూర్ దూరదర్శన్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీటీటీఐ, ఎన్ఎండీసీ, రామంతాపూర్ మెయిన్‌రోడ్డు, దూరదర్శన్ క్వార్టర్స్, హోమియోపతి కళాశాల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు.

రామంతాపూర్ : విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దూరదర్శన్ విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీటీఐ, ఎన్ఎండీసీ, రామంతాపూర్ మెయిన్‌రోడ్డు, దూరదర్శన్ క్వార్టర్స్ హోమియోపతి కాలేజ్ హాస్పిటల్ తదితర ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోనాలు

అల్వాల్: అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆస్పత్రి వైద్యులు, మహిళా సిబ్బంది బోనమెత్తి మైసమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. వైద్యులు శ్వేత, శైలజ, అనఘ, స్టాఫ్ నర్సులు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బోడుప్పల్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 12వ డివిజన్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాపోలు రాములు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

మౌలాలి: బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని మౌలాలి కార్పొరేటర్ సునీత కోరారు. డివిజన్ పరిధి హనుమాన్‌నగర్‌లో వాసు ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనాల జాతరను మత సామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని, నిబంధనలు పాటిస్తూ.. పోలీసులకు సహకరించాలని సూచించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రేరణాత్మక ప్రదర్శన

బోడుప్పల్: అంధ విద్యార్థులు చదువుతో పాటు పలు రంగాల్లో రాణిస్తున్నారని జీజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్‌కాలనీలోని స్కూల్‌లో ఇట్రాడ్ షో స్వచ్ఛంద సంస్థ అంధ విద్యార్థులు ప్రేరణాత్మక కార్యక్రమాన్ని ప్రదర్శించారు. డ్యాన్స్‌లు, ఆర్కెస్ట్రా, పాటల రూపంలో ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారికి స్కూల్ యాజమాన్యం రూ.20 వేల ప్రోత్సాహకం అందజేశారు. వారి ప్రతిభను ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ముందుకు నడవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

మల్లాపూర్: నాచారం పాత గ్రామంలో విలువైన జీహెచ్ఎంసీ ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కాప్రా సర్కిల్ అధికారులను నాచారం డివిజన్‌కు చెందిన సామాజికవేత్త గద్ద క్రాంతికిషోర్ కోరారు. నాచారం వార్డు కార్యాలయం నుంచి బాబానగర్‌కు వెళ్లే మార్గంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద రూ.30 లక్షల విలువైన 60 గజాల స్థలాన్ని కబ్జా చేశారు. గతంలో సదరు స్థలంలో గ్రామస్తులకు టాయిలెట్స్ నిర్మించారన్నారు. కాలానుగుణంగా మార్పులతో స్థలం కబ్జా కాకుండా జీహెచ్ఎంసీ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. అయినా స్థలంలో ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశారన్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

భగాయత్ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


కల్వర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్ : రామంతాపూర్ భగాయత్ వెంకటసాయినగర్ కాలనీ సర్వేనెంబర్ 40, 40/ఏ బీరప్ప దేవాలయం వెనుక లైన్‌లో మంజూరైన వంతెన స్థలాన్ని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాక్స్ కల్వర్టు పనులను వచ్చే వారం రోజుల్లోగా ప్రారంభిస్తామని, వాటితో పాటు కాలనీలో భూగర్భ డ్రైనేజీ లైన్లు, సీసీరోడ్లు మంజూరు చేయిస్తానన్నారు. భగాయత్ కేసీఆర్‌నగర్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ జలమండలి అధికారులను ఆదేశించానని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి..

ఉప్పల్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజయేందర్ రెడ్డి, శంకర్, రమేష్‌యాదవ్, హుస్సేన్, శివయాదవ్, ఐలేష్‌యాదవ్, గోపాల్, అశోక్, గోవింద్, కీర్తి టీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సర్వ సత్తయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతలకు దారితీసిన బోనాల చెక్కుల పంపిణీ


అల్వాల్ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో చెక్కుల పంపిణీలో ఘర్షణ


మాట్లాడుతున్న ఏసీపీ బాల గంగిరెడ్డి

అల్వాల్: బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉద్రిక్తలకు దారితీసింది. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఏర్పడిన విభేదాలు ఒక్కసారి గుప్పుమన్నాయి. మంగళవారం అల్వాల్ బాలాజీ వేంకటేశ్వరఆలయంలో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రొటోకాల్ పేరుతో ఘర్షణ పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు మల్కాజిగిరి, అల్వాల్ ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవి ఎంతవరకు దారితీస్తాయేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సైతం అదుపు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు కలిసి ఉన్న నాయకులు పార్టీ మారడంతో పరస్పరం బద్ధ శత్రువులుగా మారి దాడులు చేసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డాక్టర్ కొండల్‌రావు పురస్కారం ప్రదానం



కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ స్మారకార్థం స్మారక పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ఈ పురస్కారానికి ఇస్రో చైర్మన్, అంతరిక్షశాఖ కార్యదర్శి డాక్టర్ నారాయణన్‌ను ఎంపిక చేశారు. మంగళవారం ఎన్ఎఫ్‌సీలో ఇండియన్ సొసైటీ ఫర్ నాన్–డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఐఎస్ఎన్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ కొండల్‌రావు 101వ జయంతి వేడుకల్లో ఆయనకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణన్ మాట్లాడుతూ.. భారత అంతరిక్ష కార్యకలాపాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు కార్యాచరణ వంటి పలు అంశాలపై ప్రసంగించారు. విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్, ఎన్ఎఫ్‌సీ సంయుక్తంగా నిర్వహించిన అంతరిక్ష పరిశోధనలు, సాధించిన ప్రగతిని ఎన్ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్‌కపూర్ ఆయనకు వివరించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం



ఇన్వెస్టిచర్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కాప్రా: విజయ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుకలు ఘనంగా జరిగాయి. హైస్కూల్ స్థాయిలో వివిధ విభాగాలు బ్లూ, గ్రీన్, రెడ్ తదితర విభాగాల నుంచి నాయకులను ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. మంగళవారం స్కూల్ కరస్పాండెంట్ రాజేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు కల్పించడమే కాకుండా ఓటింగ్ ఎంపిక, జవాబుదారితనంతో పాటు విలువైన పాఠం నేర్చుకుంటారన్నారు. స్కూల్ డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.